క్లుప్తంగా

మెప్మా కార్యాలయం తనిఖీ



రికార్డులను పరిశీలిస్తున్న మేనేజర్

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలోని మున్సిపల్ కార్యాలయ ఆవరణలో మెప్మా కార్యాలయాన్ని శనివారం రాష్ట్ర మిషన్ మేనేజర్ ఆదినారాయణ ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. విధులకు సక్రమంగా హాజరు కావాలని, ఆలస్యంగా విధులకు హాజరైతే చర్యలు తప్పవని హెచ్చరించారు. జిల్లా, పట్టణస్థాయి సిబ్బందితో ప్రభుత్వం నిర్దేశించిన వివిధ పథకాల అమలుపై తగిన సలహాలు, సూచనలు ఇచ్చారు. ప్రభుత్వ పథకాలు అర్హులందరికీ వర్తించేలా చూడాలన్నారు. ఆయన వెంట ఏఓ ఆసిఫ్‌బాషా, కార్యాలయ సిబ్బంది సమీనా, సిటీ మిషన్ మేనేజర్ శోభ, మెప్మా సిబ్బంది, టీఎల్‌ఎఫ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణం చేపట్టాలి



చిన్నకంబలూరు మెట్ట వద్ద సంతకాలు సేకరిస్తున్న సీపీఐ నాయకులు

రుద్రవరం: మండల పరిధిలోని రుద్రవరం–శిరివెళ్ల ఆర్‌అండ్‌బీ రోడ్డులో చిన్న కంబలూరు మెట్ట నుంచి వకిలేరు వాగు వరకు రోడ్డు పూర్తిగా దెబ్బతినిందని, దీనిని పునర్నిర్మించాలని సీపీఐ మండల కార్యదర్శి బాలనరసింహులు, అఖిలభారత యువజన సమాఖ్య కార్యదర్శి మధు, పాములేటి, రాజన్న డిమాండ్ చేశారు. శనివారం రోడ్డుపై వెళ్లే ప్రయాణికులు, వాహనదారులతో వారు సంతకాల సేకరణ చేపట్టారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రోడ్ల అభివృద్ధి ఊసే లేదన్నారు. ఎన్నికల ముందు గొప్పలు చెప్పి ఇప్పుడు చేతులు ఎత్తేసిందని మండిపడ్డారు. రోడ్డు దుస్థితిపై త్వరలో కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేయనున్నట్లు వారు తెలిపారు.

ఎన్‌హెచ్‌ఆర్‌సీ ఇన్‌చార్జ్‌గా ఈదూరు పద్మాకర్

కర్నూలు(అర్బన్): కేంద్ర ప్రభుత్వంచే నయోదు చేయబడిన నేషనల్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ రాష్ట్ర ఇన్‌చార్జ్‌గా కర్నూలుకు చెందిన ఈదూరు పద్మాకర్ నియమించబడ్డారు. ఈ మేరకు ఎన్‌హెచ్‌ఆర్‌సీ నేషనల్ చైర్మన్ డాక్టర్ పీ సంపత్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేయడంతో పాటు నియామకపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా శనివారం పద్మాకర్ విలేకరులతో మాట్లాడుతూ తాను గతంలో ఎస్‌టీబీసీ కళాశాలలో విద్యార్థి నాయకునిగా, రాష్ట్ర నర్సింగ్ కళాశాల అసోసియేషన్ అధ్యక్షుడిగా పనిచేశానన్నారు. పౌరుల హక్కులను కాపాడేందుకు తన శాయశక్తులా కృషి చేస్తానన్నారు.

రక్ష హాస్పిటల్‌కు తాళం

కర్నూలు(హాస్పిటల్): స్థానిక కొత్తబస్టాండ్ సమీపంలోని రక్ష హాస్పిటల్‌కు జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ పి.శాంతికళ శనివారం సాయంత్రం తాళం వేశారు. ఈ హాస్పిటల్‌లో ఓ మహిళకు లింగనిర్ధారణ చేయడంతో ఆమెకు జన్మించబోయేది ఆడబిడ్డ అని తేల్చారని, దీంతో నందికొట్కూరులో ఓ ఆర్‌ఎంపీ ఆమెకు అబార్షన్ చేయడంతో మృతి చెందినట్లు విచారణలో తేలింది. దీంతో నంద్యాల డీఎంహెచ్ఓ డాక్టర్ వెంకటరమణ అక్కడికి వెళ్లి వివరాలు తెలుసుకున్నారు. స్కానింగ్ చేసింది కర్నూలులోని రక్ష హాస్పిటల్‌లో అని, చర్యలు తీసుకోవాలని కర్నూలు డీఎంహెచ్‌వో డాక్టర్ పి.శాంతికళకు లేఖ రాశారు. ఈ మేరకు డాక్టర్ పి.శాంతికళ శనివారం సాయంత్రం రక్ష హాస్పిటల్ తనిఖీకి వెళ్లారు. అయితే ఆసుపత్రి యాజమాన్యం, సిబ్బంది ఎవరూ లేకపోవడంతో ఆసుపత్రికి తాళం వేశారు. ఆమె వెంట డీఐవో డాక్టర్ నాగప్రసాద్, డెమో శ్రీనివాసులు శెట్టి ఉన్నారు.

తైక్వాండోలో పతకాలు

కర్నూలు (టౌన్): విజయవాడలో చెన్నుపాటి రామకోట స్టేడియంలో నిర్వహించిన జాతీయ స్థాయి ఓపెన్ తైక్వాండో పోటీల్లో కర్నూలుకు చెందిన 11 మంది క్రీడాకారులు పతకాలు సాధించారు. ఈ క్రీడాకారులను శనివారం స్థానిక షరీన్ నగర్‌లోని వెంకట్ తైక్వాండో అకాడమీలో జిల్లా ఒలంపిక్ సంఘం కార్యదర్శి జి. శ్రీనివాసులు అభినందించారు.

నల్లమలలో నిలిచిన వాహనాలు



నల్లమల ఘాట్ రోడ్డులో ఆగిన వాహనాలు

మహానంది: నంద్యాల నుంచి గిద్దలూరు నల్లమల ఘాట్‌లో ఓ లారీ నిలిచిపోవడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. గుంటూరు నుంచి నంద్యాల వైపు బస్తాలతో వస్తున్న లారీ సంకేతిక లోపంతో పాత బొగద సమీపంలో నిలిచిపోయింది. దీంతో కొద్దిసేపు వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. కాగా తోటి ప్రయాణికులు, వాహనదారులు రోడ్డుకు అడ్డుగా ఉన్న లారీని పక్కకు తోయడంతో వాహన రాకపోకలు యథావిధిగా సాగాయి.

అధికారంలో ఉన్నా లేకపోయినా

అభివృద్ధే ధ్యేయం

- ఆళ్లగడ్డ మాజీ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి
- గత ఐదేళ్ల ప్రగతిపై ఎమ్మెల్యే అఖిలప్రియ వ్యాఖ్యలు హాస్యాస్పదం
- ఆమె సొంతూరు కొత్తపల్లెకు రోడ్డు వేయించింది కూడా నేనే
- వాస్తవాలు తెలుసుకొని మాట్లాడాలని హితవు



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి

ఆళ్లగడ్డ: మేము అధికారంలో ఉన్నా, లేక పోయినా నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో అభివృద్ధి చెందాలన్నదే తమ ధ్యేయమని మాజీ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి అన్నారు. స్థానిక కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే అఖిలప్రియ మాచినేని పల్లె బ్రిడ్జి ప్రారంభోత్సవానికి వెళ్లి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయంలో నియోజకవర్గంలో ఎలాంటి ప్రగతి పనులు జరగలేదని వ్యాఖ్యనించడాన్ని తీవ్రంగా ఖండించారు. అబద్ధాలు చెప్పడంలో అఖిలకు సాటిలేరన్నారు. 'అఖిల సొంత గ్రామం డబ్ల్యూ కొత్తపల్లెకు రోడ్డు లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడేవారు. 2019లో నేను ఎమ్మెల్యేగా గెలవగానే కోట్లాది రూపాయలతో రోడ్డు వేయించాను. రూ. 3 కోట్లతో దొర్నిపాడు నుంచి, రూ. 2 కోట్లతో ఎర్రగుంట్ల నుంచి కొత్తపల్లెకు రోడ్డు వేయించా. అలాగే పక్కనే ఉన్న గోవిందిన్నెకు సైతం రోడ్డుతో పాటు పెద్దమ్మ దేవాలయం అభివృద్ధికి చర్యలు తీసుకున్నా. ఇలాంటి ఎన్నో అభివృద్ధి పనులు తమ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో జరిగాయి. దొర్నిపాడు, భాగ్యనగరం గ్రామాల పరిధిలోని ప్రధాన రహదారిలో ఎప్పుడు బీటీ రోడ్డు వేసిన వెంటనే కుంగిపోతుండేది. భూమా కుటుంబం ఎప్పుడూ దీని గురించి పట్టించుకోలేదు. నేను ఎమ్మెల్యే అయిన వెంటనే ఈ రెండు గ్రామాల పరిధిలో ఆ రోడ్ల మరమ్మత్తు పనులకు రూ. 6 కోట్లు ఖర్చు చేసి సీసీ రోడ్లు వేయించా. ఇదంతా మీకు కనిపించడం లేదంటే మీకు ఏదో సమస్య ఉన్నట్టే. అభివృద్ధి చేయడంతోనే మీ గ్రామంలో నాకు మొన్న జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో 450 ఓట్లు పడ్డాయి. 2023 సెప్టెంబర్‌లో వచ్చిన వరదలకు మాచినేని పల్లె బ్రిడ్జి కుంగిపోతే 2024 జనవరిలో నిర్మాణానికి అనుమతులు తీసుకొచ్చా. ఆ తర్వాత ఎన్నికలు రావడంతో పనులు ఆగిపోయాయి. ఈ విషయాలన్నీ తెలుసుకోకుండా బ్రిడ్జి నేనే తెచ్చాను అని గొప్పలు చెప్పుకుంటే ప్రజలు నమ్మ'రని ఎమ్మెల్యే అఖిలకు గంగుల హితవు పలికారు.

పింఛన్ హామీ ఏమైంది?

పింఛన్‌లు ఇస్తున్నామని గొప్పలు చెబుతున్నారు.. అధికారంలోకి రాగానే బీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాలకు ఏభై ఏళ్లకే పింఛన్ ఇస్తామన్నారు మరి ఆ హామీ ఏమైందని టీడీపీ నాయకులను గంగుల బిజేంద్రారెడ్డి ప్రశ్నించారు. తల్లికి వందనం పోయిన సంవత్సరం ఎగ్గొట్టి ఈ ఏడాది అందరికీ ఇచ్చామని ప్రచారం చేసుకోవడం ఎంతవరకు కరెక్ట్ అవుతుందన్నారు. కరోనా వ్యాప్తి సమయంలో పిల్లలు బడికి పోకపోయినా అమ్మఒడి పథకం అమలు చేసిన ఘనత తమ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదన్నారు. కూటమి సర్కారు 18 సంవత్సరాలు నిండిన ప్రతి మహిళకు ఆడబిడ్డ నిధి కింద నెలకు రూ. 1500 ఇస్తామన్నారు. ఈ హామీ ఎప్పుడు అమలు చేస్తారో చెప్పాలన్నారు. చంద్రబాబు ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేసే వరకు తాము ప్రశ్నిస్తూనే ఉంటామన్నారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ మునిసిపల్ విభాగం రాష్ట్ర జాయింట్ సెక్రటరీ గొట్లూరు సుధాకర్‌రెడ్డి ఉన్నారు

విద్యాహక్కులను కాలరాస్తున్న కూటమి ప్రభుత్వం



మాట్లాడుతున్న సూర్యప్రతాప్

నంద్యాల(న్యూటౌన్): విద్యాహక్కులను కూటమి ప్రభుత్వం కాలరాస్తుందని ఏఐఎస్‌ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సూర్యప్రతాప్ అన్నారు. పట్టణంలోని ఆ ఫెడరేషన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో కూటమి ప్రభుత్వం చేస్తున్న అవినీతిని బయటపెడతారన్న భయంతో విద్యార్థి సంఘాలను దూరం చేయడం తగదన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లోకి విద్యార్థి సంఘాలను రానివ్వకూడదని జీవోలను తీసుకొని రావడం తగదన్నారు. రాష్ట్రంలో విద్యార్థుల హక్కులను విద్యాశాఖ మంత్రి కాలరాస్తున్నారని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యతలేని యూనిఫాం, షూష్‌తో పాటు మధ్యాహ్న భోజన పథకాన్ని విద్యార్థులకు అందిస్తున్నారని, వాటిని బహిరంగంగా బయట పెడతారన్న భయంతో ఇలాంటి నిర్ణయం తీసుకోవడం తగదన్నారు. ఇలాంటి జీవోలను వెంటనే ఎత్తివేయాలని, లేని పక్షంలో ఆందోళన కార్యక్రమాలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో ఏఐఎస్‌ఎఫ్ నాయకులు ప్రవీణ్, మల్లి, అర్జున్, వెంకటేష్, ధనూష్, తదితరులు పాల్గొన్నారు.

అట్టహాసంగా జూడో ఎంపిక పోటీలు



జూడో ఎంపిక పోటీలు నిర్వహిస్తున్న దృశ్యం

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలోని పద్మావతినగర్ ఇండోర్ స్టేడియంలో శనివారం నంద్యాల డిస్ట్రిక్ట్ సబ్ జూనియర్ జూడో బాలబాలికల ఎంపిక పోటీలు నిర్వహించినట్లు నంద్యాల జిల్లా జూడో అసోసియేషన్ అధ్యక్షుడు సుధాకర్ తెలిపారు. సబ్ జూనియర్ జూడో బాలికల ఎంపిక పోటీలకు 200 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. పది సబ్ జూనియర్ విభాగంలో మంచి ప్రతిభ చూపిన క్రీడాకారులు ఈనెల 9, 10 తేదీల్లో మంగళగిరిలో జరిగే సబ్ జూనియర్ రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయ నాయకులు దండె నాగరాజు, విశ్వనాథ్, భాస్కరరెడ్డి, షేక్షావలి, రత్నకుమార్, మహబూబ్‌బాషా, జూడో కోచ్ శాంతరాజు, సయ్యద్ బాషా, తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లను ఉపసంహరించుకోవాలి



పట్టణంలో ప్రచారం నిర్వహిస్తున్న దృశ్యం

నంద్యాల(న్యూటౌన్): స్మార్ట్ మీటర్ల ఏర్పాటును వెంటనే ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని ప్రజా సంఘాల ఐక్యవేదిక నాయకులు డిమాండ్ చేశారు. ఆ ఐక్య వేదిక ఆధ్వర్యంలో శనివారం మాకొద్దు బాబు ఈ స్మార్ట్ మీటర్లు అంటూ పట్టణంలోని నడిగడ్డ, నబీనగర్, ఆత్మకూరు బస్టాండ్, జుమ్మా మసీదు ప్రాంతాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఐక్యవేదిక కన్వీనర్ పుల్లా నరసింహులు, ముస్లిం జేఏసీ నాయకులు అబులైజ్, వెల్ఫేర్ పార్టీ కన్వీనర్ అన్సర్‌బాషా, శివ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకొని వచ్చిన స్మార్ట్ మీటర్లతో ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. కరెంట్ బిల్లులు గతంలో కంటే ఎక్కువగా వస్తున్నాయన్నారు. ప్రజాభిప్రాయ సేకరణ లేకుండా బలవంతంగా స్మార్ట్ మీటర్ల బిగించడం తగదన్నారు. తక్షణమే ప్రజలపై భారాలు లేకుండా స్మార్ట్ మీటర్లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు సాయి, హరి, సురేష్, నరసింహ, అంకారావు తదితరులు పాల్గొన్నారు.

కోటకొండ గ్రామ సచివాలయంలో రచ్చ

- వీఏఏ, వీఆర్ఏ మధ్య వాగ్వాదం



కోటకొండ గ్రామ సచివాలయంలో వాదించుకుంటున్న వీఏఏ, వీఆర్ఏలు

రుద్రవరం: మండల పరిధిలోని కోటకొండ గ్రామ సచివాలయంలో విధుల విషయంలో శనివారం వీఏఏ, ఆ గ్రామ వీఆర్ఏ మధ్య వాగ్వాదం జరిగింది. ఒకరినొకరు నువ్వెంత అంటే నువ్వెంత అని వాదించుకున్నారు. కొత్తగా విధులోకి చేరిన వీఏఏ ఉమాదేవి ఫీల్డ్ వర్క్ చేసుకునేందుకు ఓ రైతుకు సంబంధించిన పొలం చూపించాలని వీఆర్ఏ బాషాను అడిగింది. అయితే, తాను వీఆర్వో చెబితేనే వస్తామని సమాధానం ఇవ్వడంతో మీరు సచివాలయ ఉద్యోగులు చెప్పింది చేసేందుకే కదా ఉండేది అని ఆమె గట్టిగా చెప్పింది. గతంలో అలా చేయడం వల్ల ఇబ్బంది పడ్డామని, ప్రస్తుతం ఒక్కో శాఖ నుంచి ఒక్కో అధికారి ఉన్నారని ఎవరి పనులు వారు చేసుకోవాల్సిందే అని బదులిచ్చారు. దీనిపై ఆగ్రహించిన వీఏఏ చెప్పింది చేయనప్పుడు ఇక్కడ నువ్వెందుకు ఉండాలని బయటకు వెళ్లిపో అంటూ గదమాయించింది. ఈ విషయంలో ఇరువురి మధ్య వాగ్వాదం జరగగా చివరకు సచివాలయ సిబ్బంది జోక్యం చేసుకుని వారిని సర్ది చెప్పారు. ఈ ఘటనపై ఎంపీడీఓ భాగ్యలక్ష్మిని వివరణ కోరగా పునావృతం కాకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

• టీడీపీ నేత కనుసన్నలలో..

సాంబవరం గ్రామంలో యూరియా పంపిణీ



ఎరువుల పంపిణీని పర్యవేక్షిస్తున్న టీడీపీ నాయకుడు వెంకటరమణ

గోస్పాడు: యూరియా పంపిణీలో అధికార పార్టీ నాయకుల పెత్తనం పెరిగిపోయింది. వారు చెప్పిన వారికి, అనుకూలమైన వారికే ఎరువులు అందుతున్నాయి. దీంతో నిజమైన రైతులకు అన్యాయం జరుగుతుంది. మండల పరిధిలోని సాంబవరం గ్రామంలో శనివారం వ్యవసాయ శాఖ వీఏఏ ఝాన్సీరాణి ఆధ్వర్యంలో రైతులకు యూరియా పంపిణీ కార్యక్రమం జరిగింది. 266 బ్యాగుల యూరియా రాగా 111 మంది రైతులకు అందజేసి చేతులు దులుపుకున్నారు. ఇందులోనూ ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న అధికార టీడీపీకి చెందిన వెంకటరమణ దగ్గర ఉండి తమకు అనుకూలమైన వారికే యూరియా అందించారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

5న జిల్లా స్థాయి చెస్ పోటీలు

నంద్యాల(న్యూటౌన్): ఈనెల 5వ తేదీన జిల్లా స్థాయి చెస్ పోటీలు నిర్వహిస్తున్నట్లు చెస్ అసోసియేషన్ అధ్యక్షుడు రవికృష్ణ, కార్యదర్శి రామసుబ్బారెడ్డి, టోర్నమెంట్ డైరెక్టర్ రామన్న శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 19 సంవత్సరాల్లోపు బాలబాలికలు ఈ పోటీలకు అర్హులన్నారు. ఎంపికైన వారు ఈనెల 8, 9 తేదీల్లో కర్నూలులోని ఆంధ్రా చెస్ అసోసియేషన్ నిర్వహించే రాష్ట్రస్థాయి చెస్ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. 4వ తేదీ సాయంత్రం 6 గంటల్లోపు ఏపీ చెస్ వెబ్‌సైట్‌లో ఎంట్రీలు నమోదు చేసుకోవాలన్నారు. మరింత సమాచారం కోసం సెల్ : 90104 51585 నంబర్లను సంప్రదించాలన్నారు.

పాలిటెక్నిక్ కళాశాలలో 5న స్పాట్ అడ్మిషన్లు

శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైలం ప్రభుత్వ ఆదర్శ గురుకుల పాలిటెక్నిక్ కళాశాలలో ఈనెల 5న స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ ఎల్.వాలియా శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 10వ తరగతి ఉత్తీర్ణులై ఆసక్తి ఉన్న విద్యార్థులు కళాశాలలో లభించే దరఖాస్తు ఫారాన్ని నింపి 4వ తేదీ సాయంత్రం లోగా అందజేయాలన్నారు. 5వ తేదీ ఉదయం 9.30 గంటలకు ఇంటర్వ్యూలకు ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలన్నారు. సీటు పొందినవారు రూ.5,800 ప్రవేశ రుసుము చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఇతర వివరాలకు 9912342068, 9573093123 నంబర్లను సంప్రదించాలన్నారు.

మహానందిలో వీకెండ్ సందడి

మహానంది: మహానందిలో శనివారం సందర్భంగా వీకెండ్ సందడి నెలకొంది. వివిధ ప్రాంతాల భక్తులు ఆలయానికి చేరుకుని కామేశ్వరీదేవి, మహానందీశ్వర స్వామి వార్లను దర్శించుకున్నారు. ఉదయం నుంచి ఆలయ ప్రాంగణంలో భక్తుల రద్దీ నెలకొంది.

అలరించిన నృత్యప్రదర్శన

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న ధర్మపథం కార్యక్రమంలో భాగంగా శనివారం ఆలయ దక్షిణ మాడవీధిలోని నిత్యకళావేదికపై శ్రీశైలంకు చెందిన ఎస్.లక్ష్మీ వారి సంప్రదాయ నృత్యప్రదర్శన ఆకట్టుకుంది. కార్యక్రమంలో సిద్ధివినాయకశరణం, వినాయక కౌత్వం, గణపతికౌత్వం, మూషికవాహన, తాండవనృత్యం, ఓం నమశ్శివాయ, శివతాండవం, కొలువై ఉన్నాడే తదితర గీతాలకు సర్వజ్ఞ, వరలక్ష్మి, గీత తదితరులు నృత్య ప్రదర్శన చేశారు.

శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించాలి

కర్నూలు కల్చరల్: విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించాల్సిన అవసరం ఉందని జేవీవీ అధ్యక్షులు సుధీర్ రాజు అన్నారు. జన విజ్ఞాన వేదిక 18వ జిల్లా మహా సభల సందర్భంగా జేవీవీ ఆధ్వర్యంలో శనివారం ఓల్డ్ బస్టాండ్ సమీపంలోని జిల్లా కేంద్ర గ్రంథాలయంలో చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. వారు మాట్లాడు తూ సైన్స్ ద్వారానే సమాజాభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. అందుకు జేవీవీ కృషి చేస్తుందన్నారు. చిత్రలేఖన పోటీల్లో 39 పాఠశాలల నుంచి 470 మంది విద్యార్థులు పాల్గొన్నట్లు నగర కార్యదర్శి నాగరాజు పేర్కొన్నారు. కార్యక్రమంలో సాహితీ స్రవంతి రాష్ట్ర కార్యదర్శి రఘుబాబు, బాలోత్సవ కమిటీ కార్యదర్శి ధనుంజయ, సమతా జిల్లా కన్వీనర్ రమాదేవి, జిల్లా కేంద్ర గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ప్రకాష్, డిప్యూటీ లైబ్రేరియన్ పెద్దక్క తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న కలశ ప్రతిష్ఠోత్సవం



గ్రామోత్సవం కోసం తలపై కలశాలను పెట్టుకుని బయలుదేరుతున్న భక్తులు



పల్లకీలో కలశాలకు గ్రామోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

ఉయ్యాలవాడ : మండలంలోని ఇంజేడు గ్రామంలో కలశ ప్రతిష్ఠోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. రెండో రోజు శనివారం ప్రధానార్చకులు పాణ్యం కృష్ణశర్మ ఆధ్వర్యంలో ఉదయం ప్రాతః కాలపూజ, యంత్రాలకు అభిషేకం, జపాలు, లక్ష్మీ గణపతి రుద్ర పంచ సూక్త విధాన హోమాలు, కలశాలకు గ్రామోత్సవం నిర్వహించారు. ప్రదోష పూజ, మహా స్నపనము, అధివాసంగ హోమాలు, మహామంగళ హారతి, మంత్రపుష్పం కార్యక్రమాలు నిర్వహించారు. అర్చకులు అనంతయ్య, రమణయ్య భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

విద్యా సామర్థ్యాల పరిశీలన



కేజీబీవీ పాఠశాల తరగతిగదిని పరిశీలిస్తున్న ఎంఈఓలు

ఉయ్యాలవాడ : మండలంలోని పుచ్చకాయలపల్లె కస్తూరిబా బాలికల పాఠశాలలో బాలికల విద్యా సామర్థ్యాలను ఎంఈఓ 1 రఘురామిరెడ్డి శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏపీ సమగ్ర శిక్ష నంద్యాల పాల్ ల్యాబ్ కో–ఆర్డినేటర్ దస్తగిరిరెడ్డితో కలిసి ప్రభుత్వం అందజేసిన 30 ట్యాబ్‌లలో విద్యార్థుల సామర్థ్యాన్ని పరిశీలించామన్నారు. విద్యార్థుల్లో వైయుక్తిక అభ్యసన పెంపొందించేందుకు ఈ ట్యాబ్‌లను అందజేశామన్నారు. ఒక్కొక్క విద్యార్థి ట్యాబ్ నుంచి ఒక్కొక్క అధ్యాయాన్ని పూర్తి చేయడం ద్వారా వారికి కావాల్సిన కనీస సామర్థ్యాలు మెరుగు పడతాయన్నారు. అనంతరం టీచర్ల అటెండెన్స్ రిజిస్టర్, విద్యార్థుల హాజరు, అడ్మిషన్, కళాశాలలో నిర్మిస్తున్న నూతన బిల్డింగ్‌లను పరిశీలించారు. కార్యక్రమంలో ఎస్ఓ అంజనమ్మ, ఎంఈఓ 2 వీర ప్రతాప్‌రెడ్డి పాల్గొన్నారు.

రైతుల సంక్షేమానికి ప్రాధాన్యం



చెక్కు విడుదల చేస్తున్న మంత్రి, కలెక్టర్

నంద్యాల(అర్బన్): రైతుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందని మంత్రి ఎన్ఎండీ ఫరూక్ పేర్కొన్నారు. శనివారం నంద్యాల మండలం కానాల గ్రామం బుగ్గరామేశ్వరస్వామి ఆలయ ఆవరణలో అన్నదాత సుఖీభవ పథకం నిధులు రైతుల ఖాతాల్లో జమ చేసే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రైతులు పంట వేసినప్పటి నుంచి ధాన్యం ఇంటికి చేరే వరకు ప్రభుత్వం అండగా నిలబడుతుందన్నారు. జిల్లా కలెక్టర్ రాజకుమారి మాట్లాడుతూ 10 సెంట్లు పైబడి ఉన్న రైతులకు ప్రతి సంవత్సరం అన్నదాత సుఖీభవ–పీఎం కిసాన్ ద్వారా రూ.20 వేలు అందజేయడం జరుగుతోందన్నారు. ఇందులో భాగంగా మొదటి విడత ఖరీఫ్ సాగుకు రూ.7వేలు అందజేశామన్నారు. జిల్లాలో ఉన్న 2,06,052 మంది రైతాంగానికి రూ.140.57 కోట్లు ఇస్తున్నట్లు చెప్పారు. అనంతరం మెగా చెక్కును రైతులకు అందజేశారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, రైతులు పాల్గొన్నారు.

రంగస్థలం నాటకానికి విశేష సేవలు



రాఘవాచార్య చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న డీఆర్ఓ

నంద్యాల: రంగస్థలం నాటకానికి బళ్లారి రాఘవాచార్య విశేష సేవలు అందించారని డీఆర్ఓ రాము నాయక్ పేర్కొన్నారు. శనివారం కలెక్టరేట్‌లో బళ్లారి రాఘవాచార్య జయంతి సందర్భంగా జిల్లా అధికారులు బళ్లారి రాఘవాచార్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా డీఆర్ఓ మాట్లాడుతూ తాడిపత్రి ఆచార్య అని పేరొందిన రాఘవాచార్య రంగస్థలం నాటకంలో వైవిధ్య పాత్రలు ధరించి పరిణితి చెందిన కళాకారుడిగా గుర్తింపు పొందారన్నారు. తొలి తరం కళామ్మ తల్లి ముద్దుబిడ్డగా నేటితరం నటీనటులకు ఆదర్శ ప్రాయంగా నిలిచారన్నారు. రాయలసీమలో జన్మించిన రాఘవాచార్య రంగస్థలంలో తన నటనతో ఉన్నత శిఖరాలను అధిరోహించారన్నారు. గాంధీజీతో పాటు విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగూర్‌తో శభాష్ అనిపించుకున్న గొప్ప నటుడు అని తెలిపారు. కార్యక్రమంలో కలెక్టరేట్‌లోని వివిధ శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మహనీయుడు పింగళి వెంకయ్య



ఉయ్యాలవాడ మోడల్‌స్కూల్‌లో పింగళి చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

ఉయ్యాలవాడ : జాతీయ జెండాను అందించిన మహనీయుడు పింగళి వెంకయ్య అని వక్తలు కొనియాడారు. శనివారం ఆయన జయంతిని పురస్కరించుకుని నంద్యాల, ఆళ్లగడ్డ నియోజకవర్గాల్లోని విద్యాసంస్థల్లో వేడుకలు నిర్వహించారు. ఉయ్యాలవాడ మోడల్ స్కూల్‌లో జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోధుడు, జాతీయ పతాక రూపకర్త అయిన పింగళి వెంకయ్య అందరికీ ఆదర్శనీయులన్నారు. భారత స్వాతంత్ర్య ఉద్యమానికి గౌరవ ప్రతీకగా నిలిచారన్నారు. దేశభక్తి, సమానత్వం వంటి విలువలు కలిగిన మహనీయుడు పింగళి వెంకయ్య అని కొనియాడారు. కార్యక్రమంలో అధాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

నంద్యాల (వ్యవసాయం): నంద్యాల పట్టణంలోని శ్రీ పింగళి సూరన స్మారక శాఖ గ్రంథాలయంలో పింగళి వెంకయ్య చిత్రపటానికి ప్రముఖ న్యాయవాది వేదుర్ల రామచంద్ర రావు పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పింగళి వెంకయ్య 1921వ సంవత్సరంలో విజయవాడలో జరిగిన ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీ సమావేశంలో గాంధీజీ జాతీయ పతాకం తయారు చేయమని పింగళి వెంకయ్యను అడగగానే తయారు చేసి ఇచ్చారన్నారు. 1916 లో ×భారతదేశానికి ఒక జాతీయ పతాకం ×అనే ఆంగ్ల గ్రంథాన్ని కూడా రచించారని తెలిపారు . జాతీయ పతాకంపై ఉన్న రంగుల ప్రత్యేకతలను వివరించారు. కాషాయ రంగు ధైర్యానికి, తెలుపు రంగు శాంతికి, ఆకుపచ్చ రంగు విశ్వాసానికి ప్రతీకలని మధ్యలో అశోక చక్రం కూడా ఉంటుంది. ఇది కదలికలో జీవం, స్తబ్దతలో మరణం ఉందని సూచించడంతో పాటు చట్టబద్ధమైన ధర్మానికి చిహ్నంగా పనిచేస్తుందని తెలిపారు. ప వందేమాతరం, హోమ్ రూల్ ఉద్యమం, ఆంధ్రోద్యమం తదితర వాటిల్లో పింగళి వెంకయ్య ప్రధాన పాత్ర పోషించారని చెప్పారు. కార్యక్రమంలో రికార్డు అసిస్టెంట్ శ్రీధర్, దస్తగిరి, మల్లికార్జున, గ్రంథాలయ పాఠకులు రమణ, రామకృష్ణుడు, ఆదినారాయణ వెంకటరమణ, శ్రీనివాసులు, జగన్ వెంకటేశ్వర్లు, రవి, హబీబుల్లా, ఆశిక్, మనోహర్ పాల్గొన్నారు.

ఇక్కడ రోగులే వైద్యం చేసుకోవాలి



చాగలమర్రి పీహెచ్‌సీలో రోగులే తమ గాయాలకు చికిత్స చేసుకుంటున్న దృశ్యం



ఎంఎన్ఓ గైర్హాజరుతో ఓపీ రాస్తున్న ఏఎన్ఎం

చాగలమర్రి: పక్క చిత్రంలో గాయాలకు డ్రెస్సింగ్ చేసుకుంటున్నది రోగులే. వైద్య సిబ్బంది నిర్లక్ష్యానికి అద్దం పట్టే ఈ ఘటన శనివారం చాగలమర్రి పీహెచ్‌సీలో చోటు చేసుకుంది. ఈ పీహెచ్‌సీ పరిధిలో 8 సబ్ సెంటర్‌లు ఉన్నాయి. అయితే, సరైన పర్యవేక్షణ లేకపోవడంతో అంతా ఇష్టారాజ్యంగా మారిపోయింది. శనివారం వివిధ గ్రామాల నుంచి సేవల నిమిత్తం వచ్చిన రోగులు పీహెచ్‌సీలో వైద్య సిబ్బంది అందుబాటులో లేక తీవ్ర ఇబ్బంది పడ్డారు. కాళ్లు, చేతులకు గాయాలు, పుండ్లు అయిన వారు తప్పని పరిస్థితిలో సొంతంగా డ్రెస్సింగ్ చేసుకున్నారు. ఓపీ నిర్వహించాల్సిన ఎంఎన్ఓ విధులకు గైర్హాజరు కావడంతో ఏఎన్ఎం విజయలక్ష్మి ఆ బాధ్యతలు నిర్వహించారు. అష్టకష్టాలు పడి ఆసుపత్రికి వస్తే ఇక్కడ వైద్య సేవలు అందించే వారు లేరని రోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.